క్లుప్తంగా

టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహబూబాబాద్ మండల శాఖ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం సోమవారం తెలిపారు. అధ్యక్షుడిగా భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా రమలింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, శంకర్, హరిణి, శ్రీను, కార్యదర్శులుగా రఫిక్, కవిత, సరిరాం, రవి, మంగీలాల్, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాస్, అనిత, శ్రీను, సైదులురెడ్డి, బబర్‌లాల్, నరేష్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేత్రాల దానం



తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన భవిరిశెట్టి భారతి ఈనెల 16న మృతి చెందింది. నేత్రదానం చేయాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా తరుణి ప్రతినిధులు మృతురాలి భర్త సేనాపతి, కుమారుడు మహేందర్‌లను కోరగా వారు అంగీకరించారు. నేత్ర నిపుణులను గ్రామానికి పంపించి నేత్రాలను సేకరించారు. సోమవారం చింతలపల్లి గ్రామంలో సేవా తరుణి అధ్యక్షురాలు మాదవపెద్ది వాణి ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి కుటుంబ సభ్యులను సత్కరించారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అప్సర్ బేగం



డోర్నకల్: స్థానిక బ్రిలియంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అప్సర్ బేగం రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం అందుకుంది. యునివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 15వ ఎడ్యుకేషన్ లీడర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆఫ్ ది ఇయర్ –2024 అవార్డు అందుకున్నారు.

చేయూత అవసరం



తొర్రూరు: సేవా కార్యక్రమాలు చేసే వారికి చేయూత అందించాల్సిన అవసరం ఉందని కేజీబీవీ ప్రత్యేకాధికారి బి. శైలజ అన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, స్నాక్ గిన్నెలు అందించారు. ఎస్ఓ శైలజ మాట్లాడుతూ.. కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థుల అభివృద్ధికి దాతలు సహకరించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్, దాత కాసోజు సాయినాథ్, అధ్యాపకుడు మర్స కట్ల అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రగుల సిద్దరాములుగౌడ్ సోమవారం ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

కలుషిత నీరు సరఫరా



తాగునీటిలో చేప పిల్ల

తొర్రూరు: మున్సిపాలిటీలో సరఫరా చేస్తున్న మంచినీరు కలుషితమై వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏడో వార్డులో స్థానిక మహిళలు నీళ్లు పడుతుండగా చేపపిల్లలు, చెత్తా చెదారంతో కూడిన నీళ్లు సరఫరా అయ్యాయని స్థానిక మహిళలు వాపోయారు. పట్టణానికి మిషన్ భగీరథ నీరు, మున్సిపాలిటీ నీరు సరఫరా అవుతున్నాయి. ట్యాంకుల శుభ్రత పాటించకపోవడం వల్లే కలుషిత నీరు సరఫరా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ వేసి ట్యాంకులు శుభ్రం చేసిన తర్వాతే నీటి సరఫరా చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని సామాజిక కార్యకర్త బందు విజయ డిమాండ్ చేశారు.

కృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో యువకులు ఉట్లు కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

మహబూబాబాద్ రూరల్: రాధాకృష్ణుల వేషధారణ పోటీలు



మానుకోట మార్వాడి సత్రంలో వేడుకల్లో పాల్గొన్న యువకులు



గూడూరు: అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు





కురవి: స్తంభం ఎక్కుతున్న యువకులు



కేసముద్రం: గోపిక వేషధారణలో చిన్నారి



మహబూబాబాద్ అర్బన్‌లో చిన్నారులు..



మహబూబాబాద్ రూరల్‌లో..



చిన్నగూడూరు(నర్సింహులపేట)లో చిన్నారి



బయ్యారం: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు



కేసముద్రం: కల్వలలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై మురళీధర్‌రాజు

బస్సు సౌకర్యం కల్పించాలి

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు, శ్రీరామచంద్ర మిషన్ సభ్యులు ఆదివారం మహబూబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కనీసం రెండు ట్రిప్పులైనా బస్సును నడిపించాలని వారు వినతిపత్రంలో కోరారు. సభ్యులు శ్రీనివాస్, నర్సయ్య, లాలయ్య, వెంకన్న ఉన్నారు.

నేడు ఏఐకేఎస్ ధర్నా

నెహ్రూసెంటర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సోమవారం పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొర్రీలు లేకుండా రైతు రుణాలు మాఫీ చేయాలని సూచించారు. రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యంనగర్ కాలనీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఇమాం, పెంద్ర ఆనంద్, సరుకొండ సంజీవను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,100 నగదు సీజ్ చేశామన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కేసముద్రం: మాట్లాడుతున్న సురేందర్

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా, ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మేరెడ్డి సురేందర్, తుంపిళ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కేసముద్రంవిలేజ్‌లో మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి చేపట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మహబూబాబాద్ జిల్లాలోనే కేసముద్రంను ప్రథమ స్థానంలో నిలబెట్టాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కన్వీనర్‌గా గాంతి వెంకట్ రెడ్డి, కోకన్వీనర్లుగా మల్యాల రాములు, ఎలబోయిన కరుణాకర్, బండి వెంకన్నను నియమించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రమేష్, ఉపేందర్, గోపాల్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

గూడూరు: దేశంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు కలిగిన బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోధనపల్లి లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, శ్రీశైలం, నాగరాజు, అనిల్, రాజు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రతీ కార్యకర్త తమ బాధ్యతగా రెండు వందల సభ్యత్వాలు నమోదు చేయాలని మహబూబాబాద్ జిల్లా బీజేపీ సభ్యత్వ ప్రముఖ్, ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భరత్, భుక్య సంగీత, కొమ్ము శోభన్, బండి నరేష్, సురేష్ పాల్గొన్నారు.

వాయిదా వేయడం సరికాదు

గార్ల: మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి దేవాలయం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం వాయిదా వేయడం సరికాదని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.1.50కోట్లు విరాళం ఇచ్చిన ఎన్నారై పులి గోపాల్ రెడ్డి, ప్రమీలారెడ్డి దంపతులు అమెరికా నుంచి వచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈనెల 28న నిర్వహించే దైవకార్యానికి హాజరై సజావుగా సాగేలా కృషి చేయాలని ఆమె కోరారు.

రూ.లక్ష చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: మండలంలోని లక్ష్మీపురం తండా గ్రామానికి చెందిన భూక్య దినేష్ సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించాడు. ఈసందర్భంగా సోమవారం హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష చెక్కు అందజేసి అభినందించారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు



చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

గార్ల: మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నా, వాటిని నివారించడంలో సంబంధిత వైద్యులు, వైద్యసిబ్బంది వైఫల్యం చెందారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో విషజ్వరాలు సోకిన సమయంలో ప్రజలు కీళ్లనొప్పులతో నడవలేకపోతున్నారు. గ్రామాల్లో పలుచోట్ల డెంగీ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. గార్లలోని 30పడకల సీహెచ్‌సీ ఆస్పత్రికి ప్రతీరోజు 250 నుంచి 300 మంది విషజ్వరాలతో ఓపీ వస్తుండటంతో, సీహెచ్‌సీలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉండటంతో ఖమ్మం, మహబూబాబాద్ కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు వైద్యులు, వైద్యసిబ్బంది స్థానికంగా ఉండకుండా సుదూర పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తూ విధుల పట్ల సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, డీఎంహెచ్ఓ స్పందించి గ్రామాల్లో విషజ్వరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జయప్రదం చేయండి

దంతాలపల్లి: ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా మహాసభలను జయప్రదం చేయాలని తొర్రూరు డివిజన్ మహిళా సంఘం సహాయ కార్యదర్శి ఊడుగుల కనకమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 31నుంచి సెప్టెంబర్ 2 వరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు విద్య, వైద్యం, ఉపాధితోపాటు అన్నిరంగాల్లో పురుషులతోపాటు సమాన అవకాశాల కల్పనకు మహిళా సంఘం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో శృతి, నవ్య, ఇందు, అనసూర్య, సంధ్య, భూలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా పోరాడుదాం



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ సెక్రటరీ రాగుల సిద్దిరాములు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపురం బాలరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు కొండగోని రవీందర్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిగే భద్రసేనగౌడ్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి మదర్ థెరిసా..



మహబూబాబాద్ అర్బన్: వేడుకలు నిర్వహిస్తున్న రామ్మోహన్‌రెడ్డి, వైఎంసీఏ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: పేదలు, నిరాశ్రయులకు సేవలందించేందుకు జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ మాతృమూర్తి మదర్ థెరిసా అని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) జిల్లా కార్యదర్శి బొడ్డు సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఫారెస్టు ఆఫీస్ సెంటర్‌లో సోమవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, పద్మ, వైఎంసీఏ గౌరవ అధ్యక్ష కార్యదర్శి లివింగ్‌వాటర్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో సోమవారం మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, అసోసియేషన్ ప్రతినిధి సంగాల మత్తయ్య, కౌన్సిలర్లు పోటు జనార్దన్, బోరగళ్ల శరత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు ప్రవీణ్‌కుమార్, సురేష్ అన్నారు. డీపీఆర్వో ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై కళాకారులు జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లలో సోమవారం ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

కురవి: ఉమ్మడి కురవి మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి మలేడి కోటయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంధసిరి శ్రీనివాస్, కట్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో జీపీ కార్యదర్శి మృతి

డోర్నకల్: మండలంలోని హూన్యాతండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వై.లక్ష్మయ్య(59) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన లక్ష్మయ్య గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శిగా హూన్యాతండాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎంపీఓ మున్వర్‌బేగ్‌తోపాటు కార్యదర్శులు రమణమూర్తి, నవీన్, మాజీ సర్పంచ్ దేవీశంకర్‌నాయక్ నివాళులర్పించారు.

ఆశకార్యకర్త..

డోర్నకల్: స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆశ కార్యకర్త శనిగారపు నిర్మల(26) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. నిర్మలకు భర్త, కుమార్తె ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

బయ్యారం: కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు జక్కుల యాకయ్య తో పాటు నాన్‌టీచింగ్ కార్మికులు కాంతమ్మ, ఈశ్వరి, శారద, కనకమ్మ, సాయమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన కొత్త కృష్ణతోపాటు పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పడగాల కృష్ణారెడ్డి, నాయకులు చిప్పరపల్లి వెంకన్న, రాయభారపు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మామకు తలకొరివి పెట్టిన కోడలు



కేసముద్రం: అనారోగ్యంతో మృతి చెందిన మామకు, కోడలు తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మండలంలోని కాట్రపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన యాటగాని వెంకటయ్య(90) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు కొంతకాలం క్రితం మృతి చెందగా, తలకొరివి పెట్టేందుకు ఎవరూ లేరు. దీంతో పెద్దకోడలు యాకమ్మ తన మామకు తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

ఆకతాయిలకు అడ్డాగా..



ఆస్పత్రి కిటికి అద్దం పగలగొట్టిన ఆకతాయిలు

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో ప్రజల ఆరోగ్యాల బాగు కోసం నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సాయంత్రం ఆకతాయిలు మందు, సిగరేట్లు తాగుతూ, అక్కడే సీసాలు పగలకొట్టడంతో ఆస్పత్రికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే గ్రామానికి వెళ్లే రోడ్డు ఉండడంతో తాగిన మైకంలో, అటుగా వెళ్లే మహిళలు, బాటసారులపై ఏమైనా దాడులు చేస్తారా అని గ్రామ ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇలాంటివి జరుగకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నివాళి

గార్ల: సీపీఎం మండల కార్యదర్శి వర్గసభ్యుడు ఇమ్మడి గోవింద్ తల్లి ఇమ్మడి సాయమ్మ(78) అనారోగ్యంతో సోమవారం గోపాలపురం గ్రామంలో మృతిచెందింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, హరినాయక్, తదితరులు నివాళులర్పించారు.

రైతులకు యూరియా కొరతను తీర్చాలి



నెల్లికుదురు: జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమయ్యే యూరియా కొరతను తీర్చాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. స్థానిక గెస్ట్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిద్రమత్తు వీడి సాగుకు సరిపోయే యూరియాను రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, యాకయ్య, పాపారావు, మోష, రామోజీ, తదితరులు పాల్గొన్నారు. 26ఎంబీడి252:మాట్లాడుతున్న రవి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

నెల్లికుదురు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై చిర్ర రమేష్ బాబు మందు బాబులను హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలల్లోని బహిరంగ ప్రదేశాల్లో సోమవారం పోలీసు సిబ్బందితో కలసి పెట్రోలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

నలుగురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం



క్షతగాత్రులు విజయ్, సురేష్

మహబూబాబాద్ రూరల్: కారు అతి వేగంతో వచ్చి అదుపు తప్పి మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా మారటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రెడ్యానాయక్ కాలనీకి చెందిన చెన్నూరి రమేశ్, రాపోలు వెంకటేష్, ముత్యాల విజయ్, వేల్పుల సత్యం నగర్ కాలనీకి చెందిన ఇండ్ల సతీష్ రెండు ద్విచక్ర వాహనాలపై ఇంటికి వస్తున్నారు. బయ్యారం మండలం చోక్లా తండాకు చెందిన తేజావత్ సురేష్, రోజా దంపతులు ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. వారి వెనకాలే ఓ కారు అతివేగంతో వస్తూ కంబాలపల్లి వైపునకు వెళ్తుంది. మున్నేరువాగు దాటాక జాతీయ రహదారిపై మూడు ద్విచక్ర వాహనాలను కారు ఎదురుగా అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతోపాటుగా కారుకు ఎదురుగా వెళ్తున్న సురేష్, రోజా వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ పరిస్థితి విషమంగా మారగా వెంకటేష్, రమేశ్, సతీష్, సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా రోజాకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలు, 108 వాహనంలో చికిత్స నిమిత్తం హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విజయ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారును ప్రమాదం జరిగిన చోటనే వదిలివేసి కారులో ప్రయాణిస్తున్న వారు పరారయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్థికసాయం

గంగారం: మండలంలోని దుబ్బగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మిర్యాలపేట గ్రామానికి చెందిన కోరం రామారావు భార్య అనిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక ఉపాధ్యాయుడు చాట్ల నాగేశ్వర్‌రావు రూ. 2వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించారు.

ఎమ్మెల్సీపై పోలీసులకు ఫిర్యాదు



టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న అంజయ్య

మహబూబాబాద్ రూరల్: సచివాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తే సీఎం రేవంత్ రెడ్డిని చెప్పులతో కొడుతానన్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుపై సోమవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య సీఐ పెండ్యాల దేవేందర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పింద్రాల రాందాసు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్, డీసీసీ అధికార ప్రతినిధి ఆరెందుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.